సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 14 । జనవరి । 2024


అబ్దుల్లాపూర్‌మెట్: విజయవాడ జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు


ఆమనగల్లు: రంగులు కొంటున్న మహిళలు


మొయినాబాద్: పతంగుల షాపు వద్ద కొనుగోళ్లు


ఇబ్రహీంపట్నం: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

సంక్రాంతి సందడి

సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా జరుపుకొనేందుకు జిల్లావాసులు సిద్ధమవుతున్నారు. మూడు రోజులపాటు నిర్వహించే పండుగ కొనుగోళ్లతో శనివారం మార్కెట్లలో ఎటు చూసినా కోలాహలం కనిపించింది. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్దేందుకు రంగులు కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. గాలిపటాల దుకాణాల్లో సందడి నెలకొంది. చిన్నాపెద్దా తేడా లేకుండా పతంగ్‌లు కొనడంలో మునిగిపోయారు. మరోవైపు కుటుంబసమేతంగా పల్లె'టూరు' బాటపట్టారు. దీంతో జాతీయ రహదారులపై వాహనాల రద్దీ నెలకొంది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడాయి.

– సాక్షి, నెట్‌వర్క్

న్యూస్‌రీల్

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ సుజాత

మాడ్గుల: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని మహేశ్వరం డీసీపీ డి.సుజాత అన్నారు. మండల పరిధిలోని కోలుకులపల్లి గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు బట్టు కిషన్ రెడ్డి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చోరీల నివారణకు అన్ని గ్రామాల్లోని ముఖ్య కూడళ్లు, దుకాణ సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం సీసీ కెమెరాల దాత బట్టు కిషన్ రెడ్డిని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనురాధ, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్, సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భూ న్యాయ శిబిరాలు

యాచారం: ధరణి పోర్టల్‌లో అవకతవకలు గుర్తించడం కోసం మండలంలోని 24 గ్రామాల్లో భూ న్యాయ శిబిరాలు నిర్వహించనున్నట్లు లీప్స్ (లీగల్ ఎంపవర్‌మెంట్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్ సొసైటీ) అధ్యక్షుడు ఎం.సునీల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి భూ సమస్యలు ఉన్నాయో గుర్తించేందుకు యాచారం మండలాన్ని పైలెట్ కింద తీసుకున్నట్లు చెప్పారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో భూ న్యాయ శిబిరాలు నిర్వహించి సమస్యలు తెలుసుకుంటామన్నారు. యాచారం మండల కేంద్రంలో ఆదివారం భూ న్యాయ శిబిరం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతుల భూ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. భూ న్యాయ శిబిరాల్లో వచ్చిన సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి భవిష్యత్తులో మరోసారి ఎదురుకాకుండా కృషి చేస్తామన్నారు.

మత్స్యశాఖ అభివృద్ధి జిల్లా చీఫ్ ప్రమోటర్‌గా నర్సింహ



ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి చీఫ్ ప్రమోటర్‌గా గొరెంకల నర్సింహ ఎన్నికయ్యారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధి కొంగరకలాన్‌లోని కల్వకోలు లక్ష్మీదేవమ్మ ఫంక్షన్ హాల్‌లో శనివారం జిల్లాలోని 184 మత్స్య సొసైటీలతో జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో గొరెంకల నర్సింహ గెలుపొందారని అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా గొరెంకల నర్సింహ మాట్లాడుతూ.. మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి పాటుపడతానన్నారు.

అడ్‌హాక్ కమిటీ సభ్యులు వీరే..

అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా దూస వెంకటేశ్, కె.లక్ష్మణ్, ఆలె కుమార్, కుక్కల కృష్ణ, నీలం సురేందర్, మోర పరమేష్, బైరమోని సతీష్, జి.సురేష్, లింగం, నీరటి అశోక్, టి.వెంకటేశ్, గోపాల్ ఎన్నికయ్యారు.

కైట్.. షార్ట్ సర్క్యూట్

విద్యుత్ వైర్లకు చిక్కుకుంటున్న పతంగ్‌లు

- తరచూ ట్రిప్పవుతున్న ఫీడర్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ప్రమాదాల బారిన చిన్నారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పండుగ వేళ సరదాగా పిల్లలు, పెద్దలు ఎగరేస్తున్న గాలిపటాలు 'షాక్' ఇస్తున్నాయి. విద్యుత్ వైర్లకు చుట్టుకుని సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి. వాటిని కిందికి బలంగా లాగడంతో ఒకదానికొకటి వైరు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో ఫీడర్లు ట్రిప్పవుతున్నాయి. వాటి పరిధిలో ఉన్న గృహ, వాణిజ్య సంస్థలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. సంక్రాంతి నేపథ్యంలో చిన్న పెద్ద లంతా కలిసి ఇళ్లపై నిలబడి పతంగ్‌లు ఎగరవేయడం తెలిసిందే. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వీధుల్లో ఉన్న లైన్ల మధ్య ఈ పతంగ్‌లు చిక్కుతూ సరఫరాలో అంతరాయానికి కారణమవుతున్నాయి. రెండు రోజులుగా జిల్లాలో వెలుగు చూస్తున్న విద్యుత్ అంతరాయాలకు ఈ పతంగ్‌లే కారణమని ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. వీటి కారణంగా శనివారం సరూర్‌నగర్, రాజేంద్రనగర్, సైబర్ సిటీ సర్కిళ్ల పరిధిలో కరెంట్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సబ్‌స్టేషన్‌లోని ఒక ఫీడర్ ఆన్ చేసిన వెంటనే మరో ఫీడర్ పడిపోతూ సెంట్రల్ బ్రేక్ డౌన్ బృందాలకు తలనొప్పిగా మారాయి.

పొంచి ఉన్న ప్రమాదాలు

ఇంటిపైనే కాకుండా బాల్కనీ, ప్రహరీలపై నిలబడి పతంగ్‌లు ఎగరవేస్తూ ప్రమాదవశాత్తు పలువురు చిన్నారులు కాలుజారి కిందపడుతున్నారు. వీరిలో కొంత మంది తీవ్ర గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుంటే.. మరికొందరు ఏకంగా మృత్యువాత పడుతున్నారు. ఇంటి ముందు నుంచి వెళ్తున్న లైన్ల మధ్య చిక్కుకున్న పతంగ్‌లనే కాదు..



డిస్ట్రిబ్యూషన్ సబ్‌స్టేషన్ వైర్ల మధ్య చిక్కుకున్న పతంగ్‌లను తీసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురవుతున్నారు. తాజాగా సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని నాగోల్‌లో ఇంటిపై నిలబడి గాలిపటం ఎగరేస్తూ ప్రమాదవశాత్తు శివకుమార్ (13) మృతి చెందాడు.

చైనా మాంజా ఉచ్చుకు..

పతంగ్‌లను ఎగరేసేందుకు కొంతమంది ప్రమాదకరమైన చైనా మాంజాను వాడుతున్నారు. ఆకాశంలో ఎగిరే పక్షులు,రోడ్డుపై వాహనాలపై వెళ్లే ప్రయాణికులు ఈ చైనా మాంజా ఉచ్చుకు చిక్కుకుని ప్రమాదాల బారినపడుతున్నారు. నిజానికి చైనా మాంజా వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినప్పటికీ.. మార్కెట్లలో విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతూనే ఉన్నాయి. టాస్క్‌ఫోర్సు పోలీసులు వీటిని గుర్తించి, విక్రయదారులను అదుపులోకి తీసుకుంటున్నా అమ్మకాలు మాత్రం ఆగడం లేదు.

జాగ్రత్తలు మేలు

- విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా, బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయండి.
- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల వద్ద ఎగురవేయడం ప్రమాదకరం.
- ఒక వేళ పతంగులు కానీ, మాంజాలు కానీ విద్యుత్ లైన్లు, ఇతర విద్యుత్ పరికరాలపై పడితే విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- కాటన్, నైలాన్, లినెన్‌తో చేసిన మాంజాలను మాత్రమే వాడండి. మెటాలిక్ మాంజాలు వాడొద్దు.
- మెటాలిక్ మాంజాలు విద్యుత్ వాహకాలు కనుక అవి లైన్లపై పడ్డప్పుడు విద్యుత్ షాక్ కలిగే అవకాశం ఉంది.
- పొడి వాతావరణంలో మాత్రమే పతంగులు ఎగురవేయాలి. తడి వాతావరణంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ.
- పతంగులు కానీ, మాంజాలు కానీ విద్యుత్ లైన్లపై, ఇతర విద్యుత్ పరికరాలపై పడ్డప్పుడు వాటిని వదిలేయండి.
- బాల్కనీ/ గోడల మీద నుంచి పతంగులు ఎగురవేయొద్దు. ఇది ప్రమాదకరం.
- పతంగులు ఎగురవేసేటప్పుడు తమ పిల్లలను గమనించాలి. పిల్లలు తెగిన, కింద పడ్డ విద్యుత్ వైర్లను తాకనివ్వొద్దు.
- ఒకవేళ విద్యుత్ వైర్లు, విద్యుత్ పరికరాలపై పతంగులు/మాంజాలు తెగిపడ్డట్లు ఉన్నా, విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడి ఉన్నా, వాటిని తాకకూడదు. వెంటనే విద్యుత్ శాఖ వారి 1912కి గాని లేదా సమీప విద్యుత్ కార్యాలయానికి గానీ లేదా సంస్థ మొబైల్ యాప్ ద్వారా గానీ లేదా సంస్థ వెబ్‌సైట్ ద్వారా www. tssouthernpower. com సంప్రదించాలి.

– ఆనంద్, సీజీఎం, ఆర్‌ఆర్ జోన్

వాహన దొంగలు దొరికారు!

- ట్రాక్టర్ ట్రాలీ, బైక్ చోరుల ముఠా ఆటకట్టు
- 23 ద్విచక్ర వాహనాలు, 13 ట్రాలీలు స్వాధీనం
- రెండు వేర్వేరు కేసుల్లో ముగ్గురు నిందితుల అరెస్టు
- రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో వాహనాల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టించారు పోలీసులు. రెండు వేర్వేరు కేసుల్లో ట్రాక్టర్ ట్రాలీలు, బైక్‌లను చోరీ చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 13 ట్రాలీలు, 23 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు శనివారం వివరాలు వెల్లడించారు.

- నల్లగొండ జిల్లా, మారేపల్లి గ్రామానికి చెందిన సంపంగి మహేశ్, ఉర్సు వెంకన్న బంధువులు. దినసరి కూలీలుగా పనిచేస్తున్న వారు విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో దొంగతనాలు చేసి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ ట్రాలీలను చోరీ చేయడం ప్రారంభించారు. నిర్మానుష్య ప్రాంతాల్లో ట్రాక్టర్ ట్రాలీలను టార్గెట్ చేసుకుని రాత్రి వేళల్లో ట్రాక్టర్‌ను తీసుకెళ్లి ట్రాలీకి హుక్కును తగిలించి అక్కడి నుంచి తరలించేవారు. అనంతరం వాటిని రీసేల్ విక్రేతలకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు.
- గత డిసెంబర్ 30న మాడ్గుల గ్రామానికి చెందిన రైతు కొప్పుల చెన్నయ్య తన పొలంలో పని పూర్తయ్యాక ట్రాక్టర్ ట్రాలీని బావి దగ్గర పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఉదయం పొలానికి వచ్చి చూసే సరికి ట్రాలీ కనిపించలేదు. దీంతో ఈనెల 6న స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం మధ్యాహ్నం కొల్కులపల్లి గ్రామంలో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా ట్రాక్టర్ ట్రాలీ దొంగతనాల విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో



నిందితులు మహేశ్, వెంకన్నను అరెస్టు చేశారు. ఇప్పటికే వీరిపై రాచకొండ కమిషనరేట్ పరిధిలో తొమ్మిది, నల్లగొండ జిల్లాలో రెండు, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒక కేసు ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి 12 ట్రాక్టర్ ట్రాలీలను స్వాధీనం చేసుకున్నారు.

కన్నేస్తే బైక్ మాయం..

ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తూ పట్టుబడి, పలు మార్లు జైలుకెళ్లినా బుద్ధి మారలేదు. బెయిల్ మీద బయటికొచ్చిన తర్వాత మరోసారి బైక్ చోరీ చేసి పారిపోతుండగా పోలీసులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన రాయుడు చైతన్య సాయికుమార్ సీతాఫల్‌మండీలో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్నాడు. చెడు వ్యసనాలకు బానిసైన అతను పాలిటెక్నిక్ చదువుతూ మధ్యలో ఆపేశాడు. మెట్రో స్టేషన్‌లో పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను దొంగిలించి, వాటి నంబరు ప్లేట్‌లను మార్చి ఇతరులకు విక్రయించి, సొమ్ము చేసుకునేవాడు.

- ఈ క్రమంలో శనివారం నాగోల్ రోడ్‌లోని ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్ వద్ద ఉప్పల్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. బైక్‌పై అటుగా వచ్చిన చైతన్య సాయి కుమార్‌ను అదుపులోకి తీసుకుని ఉప్పల్ ఠాణాకు తీసుకెళ్లి విచారించగా నేరం అంగీకరించాడు. ఇప్పటికే అతడిపై రాచకొండతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 23 కేసులు ఉన్నట్లు గుర్తించారు. నిందితుడి నుంచి 23 బైక్‌లతో పాటు ప్రింటర్, ల్యాప్‌టాప్, నకిలీ రిజిస్ట్రేషన్ కార్డులు, ఇతరత్రా వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

బకెట్లో పడి ఏడాదిన్నర చిన్నారి దుర్మరణం

కొత్తూరు: ఆడుకుంటూ వెళ్లిన ఏడాదిన్నర చిన్నారి ప్రమాదవశాత్తు నీటి బకెట్లో పడి మృతి చెందిన విషాదకర దుర్ఘటన కొత్తూరు పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రాకరం.. ధర్మేందర్ ఖోబే, హారతి దంపతులు. బిహార్‌కు చెందిన వీరు కొద్ది నెలల క్రితం జీవనోపాధి కోసం కొత్తూరుకు వచ్చి ఏడో వార్డులో నివాసం ఉంటున్నారు. కాగా కుటుంబ సభ్యులు ఇంటి పనుల్లో ఉండగా చిన్నారి పిహూ ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని బకెట్‌లో పడి ఊపిరాడక ప్రాణాలు వదిలింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన తల్లిదండ్రులు పాపను బయటకు తీయగా అప్పటికే చనిపోవడంతో బోరున విలపించారు.

విమానంలో పశ్చిమ బెంగాల్ వాసి మృతి

శంషాబాద్: హైదరాబాద్‌లో చికిత్స పొందిన అనంతరం తిరుగు ప్రయాణమైన పశ్చిమ బెంగాల్ వాసి విమానంలో మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పశ్చిమబెంగాల్ రాష్ట్రం, పశ్చిమవర్ధమాన్ జిల్లా, సలాన్‌పూర్ గ్రామానికి చెందిన షేక్ నజ్రుల్ ఇస్లాం (68) కడుపులో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ చికిత్స నిమిత్తం కుమారుడు షేక్ ముజాహిద్‌తో కలిసి ఇటీవల నగరంలోని ఏఐజీ ఆస్పత్రికి వచ్చాడు. చికిత్స అనంతరం శనివారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుర్గాపూర్‌కు వెళ్లే ఇండిగో విమానం ఎక్కారు. విమానం టేకాఫ్ అయ్యే సమయంలో ఉలుకుపలుకు లేకపోవడంతో అతడిని ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


గడ్డమల్లయ్యగూడలో నరికేసిన శ్రీగంధం చెట్టు

పగలు రెక్కీ.. రాత్రి నరికి !

- హడలెత్తిస్తున్న దుంగల దొంగలు
- ఇష్టారీతిన గంధం చెట్ల నరికివేత
- రాత్రిళ్లు పొలాలకు వెళ్లాలంటేనే భయం
- ఆర్థికంగా నష్టపోతున్నామని రైతుల ఆవేదన


శ్రీగంధం దుంగల్లోని బెరడు కోసం దుండగులు తొలిచిన పొట్టు

యాచారం: ఆటోల్లో పగటిపూట సంచరిస్తూ.. ఎక్కడెక్కడ గంధం చెట్లు ఉన్నాయో గుర్తించి.. రాత్రి పూట ఎం'చెక్కా' నరికేసి ఎత్తుకెళ్తున్నారు. ఇటు రైతులకు నష్టాన్ని మిగల్చడంతో పాటు అటు పోలీసులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. మండలంలోని గడ్డమల్లయ్యగూడ, గునుగల్, యాచారం, చింతపట్ల, మొండిగౌరెల్లి, నల్లవెల్లి, నందివనపర్తి, చౌదర్‌పల్లి, నస్దిక్‌సింగారం, చింతుల్ల, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో రైతులు స్వల్పకాలంలో అధిక ఆదాయం వస్తుందనే ఆశతో తమ వ్యవసాయ పొలాల్లో వందలాదిగా శ్రీగంధం మొక్కలు నాటారు. పదిహేనేళ్లుగా వీటిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. మరో రెండు, మూడేళ్లు గడిస్తే చెట్లకు మంచి ధర వస్తుందని భరోసాతో ఉన్నారు. వీరి కలలను దొంగల ముఠా కల్లలు చేస్తోంది. వ్యవసాయ పొలాల్లో పెరుగుతున్న గంధం చెట్లపై వీరి కన్ను పడింది. ఆరు నెలల క్రితం యాచారం, కుర్మిద్ద, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లోని వ్యవసాయ పొలాల్లో పెరుగుతున్న చెట్లను నరికి పోలీసులకు చిక్కి జైలు పాలయ్యారు. తాజాగా పక్షం రోజుల నుంచి మళ్లీ కొంతమంది చెట్లను నరికే పనిలో నిమగ్నమయ్యారు. పది మందికి పైగా దొంగల ముఠా పగలు ఆటోల్లో రెక్కీ నిర్వహించి రాత్రి పూట చెట్లను నరికి తీసుకెళ్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రెండు రోజుల క్రితం మండలంలోని ఓ గ్రామం నుంచి నిత్యం నగరానికి కూరగాయలు, ఆకుకూరలు తరలించే ఓ ఆటోను అదుపులోకి తీసుకుని యజమానిని విచారిస్తున్నారు. మరో 10కి పైగా ఆటోలను గుర్తించే పనిలో ఉన్నారు.

ఆశతోనాటితే అడియాసలు

గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో అత్యధికంగా రైతులు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసి జీవనోపాధి పొందుతుంటారు. రాత్రి, పగలు తేడా లేకుండా వ్యవసాయ పొలాల వద్దకు వెళ్తుంటారు. అధికారుల సూచనతో అధిక ఆదాయం వస్తుందనే ఆశతో అంతర పంటగా పొలం గట్లపై శ్రీగంధం మొక్కలు పెంచుతున్నారు. పక్షం రోజులుగా చెట్లను నరికివేసే ముఠా సంచరిస్తుందనే భయంతో ఆయా గ్రామాల్లోని రైతులు రాత్రి పూట వ్యవసాయ బావులు, పొలాల వద్దకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. రెండు రోజుల క్రితం గడ్డమల్లయ్యగూడలో చెట్లను నరికి తీసుకెళ్లడానికి వచ్చిన దుండగులు గునుగల్‌లోని వైన్స్ వద్ద మద్యం తీసుకుని అటవీ ప్రాంతంలోనే మాంసం వండుకుని తిని చెట్లను నరికినట్లు గుర్తించారు. రైతులు ఎదురొస్తే దాడి చేయడానికి సైతం వెనుకంజ వేయకుండా కత్తులు, గొడ్డళ్లు, ఇతర మారణాయుధాలతో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ పొలాలకు బిగించిన ఇనుప కంచెను సైతం కత్తిరించి చెట్లను నరికి తీసుకెళ్లారు. రైతులు భయంతో రాత్రిపూట వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లడం మానేశారు.

పోలీసుల్లో కలవరం..

గడ్డమల్లయ్యగూడలో పక్షం రోజుల వ్యవధిలోనే రెండుసార్లు 40కి పైగా శ్రీగంధం చెట్లను నరికి తీసుకెళ్లడంతో పోలీసుల్లో కలవరం మొదలైంది. రైతుల నుంచి ఒత్తిళ్లు రావడం, దొంగలు దొరకకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దొంగల ముఠాను ఎలాగైనా పట్టుకోవాలని గడ్డమల్లయ్యగూడ, గునుగల్, యాచారం, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లోకి వెళ్లే దారుల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.



పది చెట్లు నరికి తీసుకెళ్లారు

నా వ్యవసాయ పొలంలో పది చెట్లను నరికి తీసుకెళ్లారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. రాత్రిపూట పొలాలకు వెళ్లాలంటేనే రైతులు భయం గడుపుతున్నారు.

– గుండ్లపల్లి సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, గడ్డమల్లయ్యగూడ

త్వరలో పట్టుకుంటాం



రైతుల ఫిర్యాదు మేరకు చెట్లు నరికిన వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి పరిశీలించాం. నరికిన దుంగలను ఆటోలు, పైకప్పు ఉండే వాహనాల్లో తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు సరిగా లేకపోవడంతో గుర్తించడంలో జాప్యం జరుగుతోంది. త్వరలో దొంగల ముఠాను పట్టుకుంటాం.

– సైదయ్య, సీఐ యాచారం

కనుల పండువగా గోదా కల్యాణం

కద్తాల్: మండల కేంద్రంలోని భూనీలాసహిత చెన్న కేశవస్వామి ఆలయంలో గోదారంగనాథస్వామి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. శుద్ధజలం, పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. బాచిరెడ్డి మంజుల, నరేందర్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించగా, గూడూరు శారద, భాస్కర్ రెడ్డి, కాసోజు రమేశ్‌చారి, మాధవి దంపతులు పుస్తె మెట్టెలు అందజేశారు. కాంటేకర్ రాఘవేందర్‌జీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు రఘురాం, వేణుగోపాల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ శోభతో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్ సీజ్

కొందుర్గు: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న పదివేల లీటర్ల డీజిల్, ట్యాంకర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు కొందుర్గు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆమనగల్లుకు చెందిన ఆనంద్ కుమార్.. కొంతకాలంగా కర్ణాటక శివారు సేడమ్ ప్రాంతంలో తక్కువ ధరకు లభిస్తున్న డీజిల్‌ను కొనుగోలు చేసి తన ట్యాంకర్ ద్వారా ఇక్కడికి తరలిస్తున్నాడు. శంషాబాద్, ఆమనగల్లు ప్రాంతాల్లోని క్రషర్ మిల్లులకు విక్రయిస్తున్నాడు. ఇలా లీటర్ డీజిల్‌పై రూ.8 వరకు లాభం ఆర్జిస్తున్నాడు. ఇది తెలియడంతో మరికొంతమంది సైతం ఆనంద్ బాటలో అక్రమ వ్యాపారం మొదలు పెట్టారు. ఇదిలా ఉండగా శనివారం స్థానిక పోలీసులు కొందుర్గు చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా డీజిల్ తరలిస్తున్న వాహనం పట్టుబడింది. షాద్‌నగర్ సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్‌ప్రసాద్ సమక్షంలో పంచనామా నిర్వహించి, ట్యాంకర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

యువకుడి అదృశ్యం



మహ్మద్ ఉమర్ (ఫైల్)

పహాడీషరీఫ్: యువకుడు అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాహిన్‌నగర్ హబీబ్ కాలనీకి చెందిన మహ్మద్ రషీద్ కుమారుడు మహ్మద్ ఉమర్(20) విద్యార్థి. ఈనెల 6న తన తండ్రికి సంబంధించిన ఆటో (ఏపీ 28 వై 8604) తీసుకుని, బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని వద్ద ఫోన్ లేకపోవడం, అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం కనిపించకపోవడంతో శనివారం రషీద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో లేదా 87126 62366 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రాణం తీసిన పతంగుల సరదా

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి మృతి

- అత్తాపూర్‌లో విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి
- నాగోల్‌లో భవనంపై నుంచి పడి మరో బాలుడి దుర్మరణం



తనిష్క్ (ఫైల్)



శివకుమార్(ఫైల్)

అత్తాపూర్,నాగోల్: పతంగుల సరదా ఇద్దరు బాల ల ప్రాణం తీసింది. వేర్వేరు ప్రాంతాల్లో గాలిపటా లు ఎగురవేసే క్రమంలో జరిగిన ప్రమాదాల్లో ఇద్ద రు బాలలు మృతి చెందారు..వివరాల్లోకి వెళితే..

అత్తాపూర్‌లో విద్యుత్ షాక్‌తో..

పతంగులు ఎగరవేస్తూ విద్యుత్ షాక్‌తో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై లింగం, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన అభిషేక్ లక్ష్మీ వాణి అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతడి సోదరుడి కుమారుడు తనిష్క్ (14) అభిషేక్ ఇంట్లోనే ఉంటున్నాడు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో అపార్ట్‌మెంట్‌లో చిన్నారులతో కలిసి శనివారం పతంగులు ఎగరవేస్తున్న తనిష్క్ పతంగి తీసుకునే క్రమంలో ఇనుప చువ్వకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని అభిషేక్ భుజాన వేసుకుని ఆసుపత్రికి పరుగులు తీశాడు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్క మొరగడంతో.. భవనంపై నుండి కింద పడి..

నాగోలు: పతంగులు ఎగరేస్తూ ఓ చిన్నారి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వివరిలిలా..ఒంగోలు జిల్లా, దర్శి బండి మెరిగిల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, మల్లేశ్వరి దంపతులు కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి నాగోలులో నివాసం ఉంటూ మేస్త్రీగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరి కుమారుడు శివకుమార్(13) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 8 వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం అతను స్నేహితులతో కలిసి తాము కిరాయికి ఉంటున్న భవనంపై పతంగులు ఎగరేస్తున్నారు. భవనంపై గాలి రాకపోవడంతో సమీపంలోని మరో భవనంపైకి వెళ్లారు. అయితే సదరు ఇంటి యజమానికి చెందిన కుక్క శివకుమార్‌ను చూసి మొరగడంతో బయపడి భవనంపై నుంచి కిందకు దూకాడు. పక్కనే ఉన్న రేకులపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు అతడిని నాగోలు చౌరస్తాలోని సుప్రజా హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రక్షణలో సాయుధ బలగాల పాత్ర కీలకం

నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి



చార్మినార్: రాజధాని రక్షణలో హైదరాబాద్ నగర సాయుధ బలగాల పాత్ర కీలకమని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం ఆయన నగర సాయుధ దళ విభాగం, శిక్షణ విభాగాలను సందర్శించారు. అనంతరం పేట్లబురుజు లోని పరేడ్ మైదానంలో వివిధ విభాగాలకు చెందిన పోలీస్ బలగాల సెరిమోనియల్ పరేడ్‌కు హాజరైన ఆయన అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..1932లో ఆఫ్జన్ సిటీ పోలీస్ సాయుధ వ్యవస్థగా ప్రారంభమైన మహా నగర సాయుధ దళాల వ్యవస్థలో ఎనోన మార్పులు జరిగాయని, నేడు నగరంలో శక్తివంతమైన పోలీస్ ఫోర్స్‌గా ఆవిర్భవించిందన్నారు. నగరాన్ని సందర్శించే ప్రముఖులతో పాటు, ముఖ్యమంత్రి, గవర్నర్ తదితరులతో పాటు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులకు భద్రత కల్పిస్తున్నారన్నారు. డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్, ట్రైనింగ్ సెంటర్స్ విభాగాలు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నాయన్నారు. వారు నిరంతరం, నూతన సాంకేతికతను, శారీరక సామర్థ్యాన్ని పెంచుకుని నగరానికి మంచి పేరు తేవాలని కోరారు. వీఐపీల భద్రతలో అలసత్వానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని, ముఖ్యమైన పండుగలు కార్యక్రమాల్లో ప్రజల భద్రత దృష్ట్యా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మహిళా పోలీసులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హోమ్ గార్డ్ ఆఫీసర్స్ తదితరుల సమస్యలను సత్వరమే పరిష్కరించా లన్నారు. డ్రైవర్లు విధి నిర్వహణలో నూతన సాంకేతికతను వినియోగించాలని..వాహనాల మెయింటెనెన్స్ చార్ట్ ని తప్పకుండా పాటించాలన్నారు. ట్రైనింగ్ సెంటర్లలో త్వరలో కొత్తగా వచ్చే పోలీస్ అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నగర జాయింట్ సీపీ వి.సత్య నారాయణ, డీసీపీ (అడ్మిన్)బాపు రావు, డీసీపీ (సి ఎస్ డబ్ల్యూ) అలెక్స్, అడిషనల్ డీసీపీలు ఎం.మాణిక్ రాజ్,లక్ష్మి నారాయణ, భాస్కర్, కృష్ణా రెడ్డి, వినోద్ కుమార్, విజయ్ కుమార్, వెంకట్ రావు ఏసీపీలు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

కేశంపేట అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామ శివారులో శనివారం వెలుగుచూసింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. కొండారెడ్డిపల్లికి చెందిన మిద్దె యాదగిరి (38) బోర్ లారీ పైన కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 4న వనపర్తి జిల్లా కేంద్రంలోని కరుణాకర్‌రెడ్డి బోర్‌లారీ పైన పనికి వెళ్లాడు. 8న రాత్రి 7 గంటల సమయంలో బోర్ లారీ యాజమాని మృతుడి భార్య స్వాతికి ఫోన్‌చేసి యాదగిరి ఇంటికి వచ్చినట్లు చెప్పాడు. మృతుడికి ఫోన్ చేయగా ఒక్కసారి రింగ్ అయిన అనంతరం స్విచాఫ్ వచ్చింది. అప్పటి నుంచి యాదగిరి కోసం వెతుకుతుండగా శనివారం పోమాల్‌పల్లి శివారులోని చెరువు అలుగు వద్ద చనిపోయి ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించారు. అయితే తన కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లి మిద్దె అమృత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కరాటేతోనే ఆత్మస్థైర్యం

శంషాబాద్: ఆత్మస్థైర్యానికి కరాటే ఎంతో అవసరమని తంగిల్ ముడో మార్షల్ ఆర్ట్ కోచ్ భగవాన్‌దాస్ నాయక్ సూచించారు. తంగిల్ ముండో మార్షల్ ఆర్ట్‌లో గత రెండేళ్లుగా శిక్షణ పొంది, ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు శనివారం ఆర్‌బీనగర్ క్రీడా మైదానంలో సర్టిఫికెట్‌లను ప్రధానం చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు పుష్పలత, భారతమ్మ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, కోనమొల్ల శ్రీనివాస్, జి.వై ప్రభాకర్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, పరంధాములు తదితరులు విద్యార్థులను అభినందించారు.

తల్లి మందలించిందని..

- ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు
- కేసు నమోదు



జి.రాకేష్(ఫైల్)

పహాడీషరీఫ్: తల్లి మందలించడంతో ఓ బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. సర్దార్‌నగర్‌కు చెందిన గుట్టకాడి జంగమ్మ కుమారుడు జి.రాకేశ్(17) ఏపని చేయడం లేదు. ఈ విషయమై తల్లి మందలించింది. దీంతో ఏపీలో మెకానిక్ పని నేర్చుకుంటానంటూ ఈనెల 12న మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం ఫోన్ స్విచ్చాఫ్ చేయడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించినా ఫలితం కనిపించలేదు. శనివారం జంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో లేదా, 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో బాలింత మృతి

- వారం రోజుల క్రితమే ఆస్పత్రి నుంచి డిశ్చార్జి
- రాత్రి వేళ అస్వస్థతకు గురికావడంతో ఆర్‌ఎంపీ వద్ద వైద్యం
- షాద్‌నగర్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారణ



మృతి చెందిన పూజా

కొత్తూరు: అనుమానాస్పదస్థితిలో ఓ బాలింత మృతి చెందింది. ఈ ఘటన కొత్తూరు పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. బిహార్‌కు చెందిన సంతోష్‌కుమార్(38), చిన్న పూజాయాదవ్(22) భార్యభర్తలు. పూజాయాదవ్ ఈనెల 5న నగరంలోని పేట్లబుర్జు ప్రభుత్వ ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండడంతో వైద్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఇదిలా ఉండగా ఈనెల 12న రాత్రి సమయంలో పూజాయాదవ్ అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెను స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. కొద్దిసేపు బాగానే ఉన్న బాలింత మళ్లీ ఇబ్బంది పడటంతో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వైద్యం వికటించడంతోనే బాలింత మృతి చెందిందా..? ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనే విషయాలు పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాతే తెలుస్తాయని వెల్లడించారు.

బైక్ ఢీకొని జీపీ కార్మికురాలి దుర్మరణం

యాచారం: బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలైన పంచాయతీ కార్మికురాలు అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలు ఇలా .. గునుగల్ అనుబంధ గ్రామం ఇంద్రనగర్‌కు చెందిన భారతమ్మ(55) గడ్డమల్లయ్యగూడలో పంచాయతీ కార్మికురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. పనులు ముగించుకుని శనివారం సాయంత్రం ఇంద్రనగర్‌కు నడుచుకుంటూ బయలుదేరింది. గునుగుల్ గేట్ నుంచి మంచాల మండలం రంగాపూర్‌కు బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి గడ్డమల్లయ్యగూడలో భారతమ్మను బలంగా ఢీకొట్టాడు. ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సైదయ్య తెలిపారు. భారతమ్మ మృతిపై సర్పంచ్ ఆవేదన వ్యక్తంచేశారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు..

శంషాబాద్: తప్పిపోయిన బాలుడిని ఆర్‌జీఐఏ పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చారు. పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీలో సంచరిస్తున్న బాలుడిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాలుడిని స్టేషన్‌కు తీసుకువచ్చి ఆయా పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. విషయం తెలుసుకున్న బాలుడి తండ్రి ప్రవీణ్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వివరాలు వెల్లడించి కుమారుడిని తీసుకెళ్లాడు.

బీసీ బిల్లుపై 30 ఏళ్లుగా నిర్లక్ష్యం



మాట్లాడుతున్న కృష్ణయ్య

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య

అంబర్‌పేట్ (హైదరాబాద్): పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ 30 ఏళ్లుగా ఢిల్లీలోని పార్లమెంటు వద్ద 102 సార్లు ధర్నాలు చేసినా, 66 దఫాలుగా ప్రధాన మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల అభ్యున్నతికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న విధానాలు దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. ఆయన శనివారం కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా వైఎస్ జగన్ అవకాశాలు కల్పిస్తున్నారని, ఆయనను అన్ని పార్టీలు అనుసరించాలని కోరారు. పార్లమెంటు ఎన్నికల్లోగా దేశంలో కులగణన చేపట్టాలని, బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 5, 6 తేదీల్లో పార్లమెంటు వద్ద వేలాదిమందితో ధర్నా నిర్వహిస్తామని కృష్ణయ్య వెల్లడించారు. సమావేశంలో బీసీ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్ పాల్గొన్నారు.

జల్సాల కోసమే చోరీలు

కుషాయిగూడ: కుషాయిగూడ, వీఎన్‌రెడ్డి నగర్‌లో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు రెండు రోజుల్లో ఛేదించారు. నిందితుడిని శనివారం అదుపులోకి తీసుకుని చోరీ సొత్తు రికవరీ చేశారు. డీఐ బి.సాయిప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాలు.. కుషాయిగూడకు చెందిన కొంతం సాయికిరణ్‌రెడ్డి ఇంటర్ వరకు చదువుకున్నాడు. తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయడంతో జులాయిగా మారి వ్యసనాలకు బానిసై చోరీల బాట పట్టాడు. ఈ క్రమంలో నాచారం, కుషాయిగూడ, కీసర, మేడిపల్లి, మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటికే అతనిపై 27 దొంగతనం కేసులు నమోదయ్యాయి. 2021లో నార్సింగి పోలీసులు అరెస్టు చేయగా రెండేళ్లు జైలు శిక్ష పడింది. అయితే, గత ఏడాది జూలైలో చర్లపల్లి జైల్ నుంచి విడుదలయ్యాడు. ఆపై చర్లపల్లిలోని సి-టేఫ్ పరిశ్రమలో కార్మికుడిగా పనిలో చేరాడు. వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో తిరిగి దొంగతనాలు మొదలుపెట్టాడు. ఈ క్రమంలో గత గురువారం రాత్రి కుషాయిగూడ పరిధిలోని వీఎన్‌రెడ్డినగర్‌లో వ్యాపారి దినేశ్ ఇంట్లో చొరబడి 42 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇంట్లోకి చొరబడుతున్న సమయంలో సాయికిరణ్‌రెడ్డి కదలికలు సమీపంలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. లభించిన ఆధారాలతో పోలీసులు శనివారం సాయికిరణ్‌రెడ్డిని కుషాయిగూడలోని అతడి ఇంట్లోనే అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతని నేర చరిత్ర బయటపడింది. నిందితుడి నుంచి 30 తులాల బంగారు ఆభరణాలు, డ్యూక్ బైక్, రెడ్‌మీ స్మార్ట్ ఫోన్, నోకియా కీప్యాడ్ ఫోన్‌తో కలిపి సుమారు రూ.18.5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌ చేశారు. రాచకొండ సీపీ జి.సుధీర్‌బాబు, మల్కాజిగిరి డీసీపీ పీవీ పద్మజ, కుషాయిగూడ ఏసీపీ ఎస్.రవీందర్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టినట్లు డీఐ సాయిప్రకాశ్‌గౌడ్ తెలిపారు.